

శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, రాంనగర్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ నేతలు అంకిత భావంతో పనిచేస్తున్నారని బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డి నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నందుకు అభినందిస్తూ పార్టీ భోలక్‌పూర్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... ముషీరాబాద్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను ఎమ్మెల్యే ముఠా గోపాల్, సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి శ్రీధర్‌రెడ్డి కృషిచేస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌ముదిరాజ్, భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, నాయకులు ఉమాకాంత్, ఆకుల అరుణ్ కుమార్, కరికె కిరణ్, కళ్యాణ్, ప్రవీణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో కూలిన ప్రహరీ



ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ముషీరాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో అతిపెద్దదైన ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో చేపల కటింగ్ విభాగంలో ప్రహరీ కూలిపోవడంతో కొనుగోలుదారులు, వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లి, వివరించారు. ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించడంతో బుధవారం కూలిన ప్రహరీ పునర్‌నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ అధికారులు చేపట్టారు. ఈ పనులను బీఆర్‌ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు పూసగోరక్‌నాథ్ పరిశీలించి జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. కొనుగోలుదారులకు, వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలని కోరారు.

అంబర్‌పేట నుంచి వరంగల్ సభకు 10 వేల మంది

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు అంబర్‌పేట నియోజకవర్గం నుంచి 10 వేల మంది కార్యకర్తలు తరలివెళ్తున్నారని ఆ పార్టీ కాచిగూడ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష, అంబర్‌పేట నియోజకవర్గం సీనియర్ నాయకుడు డాక్టర్ ఓంప్రకాష్‌యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సారథ్యంలో ప్రతి డివిజన్ నుంచి 50 బస్సుల్లో కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు తరలివెళ్తున్నారని తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ భారీ సంఖ్యలో కార్యకర్తలను తరలించడానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించారని తెలిపారు. కాచిగూడ డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.



కాచిగూడలో మంచినీటి సమస్యను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ ఉమాదేవి

మంచినీటి ఎద్దడి నివారించాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో మంచినీటి ఎద్దడి నివారించకపోతే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి హెచ్చరించారు. నల్లాల్లో లోప్రెషర్ నీటి సరఫరా వల్ల వివిధ ప్రాంతాల ప్రజలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని, జలమండలి అధికారులు తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బుధవారం డివిజన్‌లోని మణియార్‌పట్టి, సునార్‌గల్లీ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. తాము పడుతున్న మంచినీటి ఇబ్బందులను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రాంతాలకు సమానంగా నీటి సరఫరా జరిగేట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సంతోష్, భీమ్‌రాజ్, సూరి, రవియాదవ్, వాసు, రామకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందాల పోటీలకు వ్యతిరేకంగా పీవోడబ్ల్యూ నిరసన



మిస్ వరల్డ్ అందాల పోటీలకు వ్యతిరేకంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ ఆధ్వర్యంలో కోఠి ఉమెన్స్ కాలేజీ వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమలత, భారతి, చైతన్య మహిళాసంఘం కార్యదర్శి శ్రీదేవి, సావిత్రి, స్వరూప, పీవైఎల్ నాయకులు ప్రదీప్, రవి, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం



వృద్ధుడి మృతదేహం

కవాడిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ ఎస్ఐ నరసింహ తెలిపిన వివరాల ప్రకారం.... ఈనెల 14న న్యూ బోయిగూడలోని ఫుట్‌పాత్‌పై 60 నుంచి 65 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తుతెలియని వృద్ధుడు చనిపోయాడని గాంధీనగర్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు. ఆయన ఆచూకీ తెలిస్తే గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా ఫోన్ నెంబర్ 8712660145లో గానీ సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిక్కడపల్లి ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పరశురామ్(45) బాగ్‌లింగంపల్లిలో భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నాడు. చిన్నచిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పరశురామ్ ఆర్థిక పరిస్థితులకు తట్టుకోలేక మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నల్లాలకు మోటార్లు వద్దు

- మొదటిసారి చలాన్లతో హెచ్చరిక.. రెండో సారి మంచినీటి కనెక్షన్ కట్
- ముషీరాబాద్ జలమండలి అధికారుల 45 రోజుల స్పెషల్ డ్రైవ్

ముషీరాబాద్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): జలమండలి ఎండీ ఆదేశాల మేరకు ప్రజలకు మెరుగైన మంచి నీటిని అందించేందుకు అధికారులు కీలకనిర్ణయం తీసుకున్నారు. నల్లాలకు మోటర్‌లు బిగించి నీటిని తీసుకునే వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు చలాన్, మంచి నీటి కనెక్షన్ కట్‌చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ముషీరాబాద్‌లోని జలమండలి రిజర్వాయర్ అధికారులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఫ్రీమోటార్ నీటి సరఫరా.. 45 రోజుల స్పెషల్ డ్రైవ్..

భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో వాటర్ ట్యాంకర్ల డిమాండ్ ముషీరాబాద్ రిజర్వాయర్ల పరిధిలో విపరీతంగా పెరిగింది. దీంతో అధికారులు 45 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టి నల్లాలకు మోటార్లు బిగించే వారిపై చర్యలకు పూనుకుంటున్నారు. నల్లాలకు మోటార్లు బిగించేవారు మొదటిసారి దొరికితే రూ.5000 చలాన్, రెండోసారి గుర్తిస్తే మంచి నీటి కనెక్షన్ కట్ చేస్తామని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. నల్లాలకు మోటార్లు బిగించడం వల్ల ఇతర ప్రాంతాలకు లోప్రెషర్ నీటి సరఫరా జరుగుతున్నదని ఈ కష్టాలను తప్పించేందుకే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొంటున్నారు.



ముషీరాబాద్‌లో మంచినీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న జలమండలి జీఎం రామకృష్ణ తదితరులు

రిజర్వాయర్ పరిధిలో జలమండలి ఉన్నతాధికారుల పర్యటన

ముషీరాబాద్ రిజర్వాయర్ పరిధిలో బుధవారం జలమండలి జనరల్ మేనేజర్ రామకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్‌రాజ్, సెక్షన్ మేనేజర్ శివసాయిలు ముషీరాబాద్, రాంనగర్, బాగ్‌లింగంపల్లి, రిసాలాగడ్డా ప్రాంతాల్లో పర్యటించారు. నీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి నల్లాలను పరిశీలించారు. మోటార్లు బిగిస్తే ఏర్పడే ఇబ్బందులు చలాన్, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రిజర్వాయర్ పరిధిలో 22వేల మంచినీటి కనెక్షన్లు ఉన్నాయని, వారికి మెరుగైన నీటి సరఫరే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

మోటార్ బిగిస్తే రూ.5 వేల చలాన్..

రిజర్వాయర్ పరిధిలో గల ఆజామాబాద్, బాగ్‌లింగంపల్లి, ముషీరాబాద్ సెక్షన్‌లలో జలమండలి సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఆయా ప్రాంతాల్లో నీటిసప్లై ఉండే రోజుల్లో పర్యటించే విధంగా ప్రణాళికలు రూపొందించారు. నల్లాలకు మోటార్‌లు బిగించినట్టు గుర్తిస్తే ప్రత్యేక జలమండలి యాప్‌ద్వారా ఫొటో తీసి రూ.5వేల చలాన్ రాస్తామని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే రెండోసారి గుర్తిస్తే మంచినీటి కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మోటార్ రహిత నీటి సరఫరా లక్ష్యం



రిజర్వాయర్ పరిధిలో మోటార్ రహిత నీటి సరఫరా చేసే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఇప్పటికే ప్రజలకు మంచినీటి వినియోగంపై అవగాహన కల్పించాం. నీటిని వృథా చేయకుండా జాగ్రత్తగా వాడుకోవాలని విజ్ఞప్తులు చేశాం. నిబంధనలు అతిక్రమించి మంచినీటితో వాహనాలు కడగడం, రోడ్లపై వృథాగా నీటిని వదిలే వారికి, నల్లాలకు మోటార్‌లు బిగించే వారికి రూ.5వేల చలాన్‌లు రాస్తున్నాం. వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మంచినీటి కనెక్షన్ కట్ చేస్తాం.

- మోహన్‌రాజ్, ముషీరాబాద్ రిజర్వాయర్ డీజీఎం

గ్రేటర్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించాలి : టీడీపీ

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో మంచినీటి సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటి తీవ్రనీటి కొరత ఏర్పడిందన్నారు. నగరంలోని మురికివాడలు, నగర శివారు ప్రాంతాల ప్రజలు నీటి ఎద్దడికి గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లవెల్లి కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, సి.ప్రకాష్, సత్యనారాయణ, భానుప్రకాష్, కృష్ణ పాల్గొన్నారు.

డా. నీలా శ్రీధర్‌కు పురస్కారం



రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్‌కు దాసరి ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు దాసరి ఫిలిం అవార్డు ఫౌండర్ చైర్మన్ తుమ్మనపల్లి రామసత్యనారాయణ బుధవారం ప్రకటించారు. 35 సంవత్సరాలుగా సాహితీ, సాంస్కృతిక, సమాజ సేవలో నీలా శ్రీధర్ అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశామని తెలిపారు. ఈ అవార్డును మే 1న నగరంలోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రదానం చేస్తామన్నారు.



కుటుంబానికి ఆర్థిక సహకారం అందజేస్తున్న యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్, నాయకులు

కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటాం

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మణిరత్నం కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని నాగమయ్యకుంట బస్తీలో నివాసం ఉంటున్న మణిరత్నం(30) కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అతనికి భార్య సోని, సంవత్సన్నర వయసు గల కుమారుడు మోహిత్, తల్లి శివరాణి, తండ్రి విజయ ఉన్నారు. మణిరత్నం రిహాబిలిటేషన్ సెంటర్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూ కాంగ్రెస్ పార్టీ చురుకైన కార్యకర్తగా పనిచేస్తున్నాడు. గుండెపోటుతో మృతి చెందిన మణిరత్నం కుటుంబాన్ని అరవింద్‌కుమార్ యాదవ్ బుధవారం పరామర్శించి, ఆర్థిక సహకారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు తిరుమల్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు శ్రీనివాస్, కృష్ణగౌడ్, బాబు, అనూష తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గణేష్‌నాయక్

లంబాడీలకు మంత్రి పదవి కల్పించాలి

నంగారా భేరీ లంబాడీ హక్కుల పోరాట సమితి

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 60 లక్షలకుపైగా లంబాడీలు ఉన్నారని, ఆ వర్గానికి చెందిన వారికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని నంగారా భేరీ లంబాడీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గణేష్‌నాయక్ పేర్కొన్నారు. త్వరలో చేపట్టనున్న మంత్రివర్గంలో అర్హులైన వారికి గిరిజన శాఖ మంత్రి పదవి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నంగారా భేరీ లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. లంబాడీలకు ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భానుశంకర్, అచ్చిబాయి. డాన్‌సింగ్, శ్రీనునాయక్; కుల్‌సింగ్, రంజిత్, రమేష్, సైదా, పునికేతావత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను భర్తీచేయాలి



పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

నల్లకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీలో తీవ్ర జాప్యం జరుగుతోందని, దీంతో టైప్ రైటింగ్‌పై ఆధారపడ్డ నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారని తెలంగాణ రికగ్నైస్డ్ టైప్ రైటింగ్ షర్ట్‌హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ (టీజీఆర్‌టీటీఎస్‌హెచ్‌సీఏ) అధ్యక్షుడు బాలిగ సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న కొలువుల జాతరలో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కొలువుల జాతరలో టైపురైటింగ్ నియామకాలు చేయాలని పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు శశిధర్, వివేక్, రామారావు, రాధ, నరేష్, భాస్కర్, శివానంద్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రాగుల ప్రవీణ్ సేవలు వెలకట్టలేనివి : ఎమ్మెల్యే



ప్రవీణ్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్‌కు రాగుల ప్రవీణ్ చేసిన సేవలు వెలకట్టలేనివని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బీఆర్‌ఎస్ అంబర్‌పేట డివిజన్ సీనియర్ నాయకుడు రాగుల ప్రవీణ్ మొదటి వర్ధంతి కార్యక్రమం బుధవారం అంబర్‌పేటలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ నిబద్ధత గల కార్యకర్తను కోల్పోయిందన్నారు. రాగుల ప్రవీణ్ చిన్న వయసులోనే మృతి చెందడం ఆయన కుటుంబానికి, పార్టీకి తీరని నష్టమన్నారు. రాగుల ప్రవీణ పిల్లల చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని, వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా రాగుల ప్రవీణ్ కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు ఎర్రబోలు నర్సింహారెడ్డి, రామారావుయాదవ్, మహేందర్ పాల్గొన్నారు.

గీత కార్మికులపై సామాజిక బహిష్కరణ ఎత్తివేయాలి

25న చలో తాళ్లరాంపూర్ : వక్తలు



అభివాదం చేస్తున్న బాల్‌రాజ్‌గౌడ్, ఎంవీ.రమణ, వెంకన్నగౌడ్ తదితరులు

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో గీత కార్మికులపై విధించిన సామాజిక బహిష్కరణను వెంటనే ఎత్తివేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ గౌడ కల్లుగీత వృత్తిదారుల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, తెలంగాణ సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవీ.రమణ, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాలో చట్టవిరుద్ధంగా ఏర్పాటైన వీడీసీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గౌడ మహిళను గుడి నుంచి గెంటేసి ఈత చెట్లను తగులబెట్టిన వీడీసీ సభ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే ఆ గ్రామాన్ని సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న గీత కార్మికులకు మద్దతుగా వేలాది మందితో చలో తాళ్లరాంపూర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, వి.ఆశయ్య, ఎల్.బాలకృష్ణ, ఉడుత రవీందర్, ఎం.దశరథ్, వీరస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దిమ్మెను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాంనగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : ఆజామాబాద్‌లోని వీఎస్టీ చౌరస్తాలో గల బీజేపీ జెండా దిమ్మెను కూల్చి, పైపును విరగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఆయన కూలిన దిమ్మె, విరిగిన బీజేపీ జెండా పైప్‌ను పరిశీలించి చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కూలిన బీజేపీ జెండా దిమ్మె, పైప్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి



తెలుగు సాహిత్యంలో కందుకూరి, బిరుదురాజు వేగుచుక్కలు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ చంద్రమౌళి

నల్లకుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో కందుకూరి వీరేశలింగం, బిరుదురాజు రామరాజు వేగుచుక్కలు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం న్యూనల్లకుంటలోని శ్రీదర్‌ప్లాజాలో తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం, బిరుదురాజు రామరాజు శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. తెలుగుభాష చైతన్య సమితి అధ్యక్షుడు పి.బడేసాబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రముఖ కవులు గంట మనోహర్‌రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళిలు హాజరై మాట్లాడారు. కందుకూరు వీరేశలింగం చేసిన భాషా సేవ, సంఘసంస్కరణలు చిరస్మరణీయమన్నారు. జానపద సాహిత్యంకు బిరుదురాజు రామరాజు చేసిన కృషి అద్వితీయమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయప్రకాష్, ఎల్.జగన్, ఆర్.ప్రవీణ్, డాక్టర్ డి.గిరీశం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పుట్టిన రోజు ఒక చెట్టు నాటాలి

ప్రీప్రైమరీ గ్రాడ్యుయేషన్ డేలో కార్పొరేటర్



పట్టాలు పొందిన విద్యార్థులతో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు శాంత తదితరులు

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతి పుట్టినరోజున ఒక చెట్టు నాటాలని, పిల్లలు ఎదిగినట్లుగా మొక్క కూడా ఎదుగుతూ మనకు కావాల్సిన ఆక్సిజన్ ఇస్తుందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్‌లోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో ప్రీప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మాట్లాడుతూ టీచర్లను సరస్వతితో, తల్లిదండ్రులను గంగతో, విద్యార్థులను యమునతో పోల్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలు అందించారు. యాంకరింగ్ చేసిన చిన్నారి ప్రతిభను, వారికి తీర్చిదునిచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంత మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి ఆశీర్వదించారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, పాఠశాల ముఖ్యులు రాజేష్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచే బీజేపీని బలోపేతం చేయాలి

కవాడిగూడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ముందుకు సాగాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం కవాడిగూడ డివిజన్ సింగాడికుంట చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం.రమేష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదుగుల సురేష్ ముదిరాజ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జి వెంకటేష్‌లు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్, నగరనాయకులు ఎంసీ మహేందర్‌బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పరిమళ్ కుమార్, నాయకులు కృష్ణహరి, బండారు యాదగిరి, లింగంగౌడ, శివరాజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మిస్తాం



దుర్గానగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ దుర్గానగర్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సహకారంతో త్వరలో కమ్యూనిటీహాల్ నిర్మిస్తామని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. డివిజన్‌లోని దుర్గానగర్‌లో ఆయన పాదయాత్ర నిర్వహించి బస్తీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దాసోజును కలిసిన మాజీ కార్పొరేటర్



బీఆర్‌ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్సీగా బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన దాసోజు శ్రవణ్‌కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సిరిగిరి శ్యామ్, దేవేందర్‌రెడ్డి తదితరులు - రాంనగర్, ఆంధ్రజ్యోతి.



రాంనగర్‌లోని మణెమ్మ గల్లీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాన్ని బుధవారం ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు
- రాంనగర్, ఆంధ్రజ్యోతి